క్లుప్తంగా

మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు



పెబ్బేరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యం లో మున్సిపల్ సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు ఇచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినీల, హెల్త్‌సూపర్‌వైజర్ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎం లావణ్య, శారద, మేనేజర్ గణేష్ బాబు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు రమాదేవి, కృష్ణవేణి, సావిత్రి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి మహ్మద్‌హుస్సేన్‌పల్లికి వెళ్లే రోడ్డుకు సమీపం లో ఉన్న పద్మనాభస్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కు స్థానిక నాయకులు వినతి పత్రం ఇచ్చారు. అల్లిపేట గుట్టపై ఉన్న పద్మనాభస్వామి పురాతన ఆలయం మంచి వాతావరణంలో ఉందని, పురావస్తు శాఖ వారు పట్టించుకోకపోవడంతో శిథిలమైందని వాపోయారు. ఎంపీ నిధులు కేటాయించి అభివృద్ధికి సహకారం అందించాలని కోరినట్లు వారు చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని శ్రీనివాసులు, పురుషోత్తం, గోపాల్, బెస్త శ్రీను, ఆనంద్, మహేందర్ తెలిపారు.

బీపీ, షుగర్ రోగులకు మందుల పంపిణీ



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌తండాలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు శనివారం ఏఎన్ఎం సుమిత్ర ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మాట్లాడుతూ తండాలో గతంలో వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు పేర్కొన్నారు. గుర్తించిన వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను వివరించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులను వాడితే నయమవుతాయన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయరా!



పాన్‌గల్: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, చెదారంతో దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఉన్న కాల్వలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకు వెళ్లక ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు అసహనం చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మురుగు కాల్వలలో పేరుకుపోయిన చెత్త, చెదారం తొలగించి దుర్వాసన రాకుండా క్రమం తప్పకుండా బ్లీచింగ్ చల్లాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాలలో ప్రతి ఒక్కరు కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ అన్నారు. చిన్నకొత్తపల్లిలో శనివారం కంటి వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా వేసవిలో దోమలతో అనేక రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రజలు దోమల నివారణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం జలుబు, దగ్గు, జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక రాజావళి ఉర్సు

- ఛాదర్ సమర్పించిన ఎమ్మెల్యే, గిడ్డంగుల చైర్మన్
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



దర్గా పరిసరాల్లో భక్తుల కోలాహలం

అమరచింత: పట్టణంలో వెలిసిన సయ్యద్ షా రాజావళి దర్గా షరీఫ్ ఉర్సు ఘనంగా కొనసాగుతుంది. ఉర్సు సందర్భంగా శనివారం తాజేచిరాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా షరీఫ్‌ను దర్శించుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ భక్తిశ్రద్ధలతో చాదర్‌ను సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్సులు గ్రామాల్లో ఐక్యతను చాటుతాయన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ నిర్వహించుకునే వేడుకలు భావితరాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మలీద ముద్దలు, కొబ్బరి కాయలతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా, నాయకులు రాజేందర్ సింగ్, రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులు గౌడ్, నాగభూషణం గౌడ్, జయసింహారెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చాదర్‌ను తీసుకొస్తున్న ఎమ్మెల్యే చిట్టెం, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ



వెండి ప్రతిమను మొక్కుతున్న గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్



బారులు తీరిన భక్తులు

కార్మిక హక్కులు కాలరాయొద్దు

అమరచింత: ఉపాధి కూలీలకు కనీస వేతనాలను అమలు పర్చాలని ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శనివారం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఉపాధి కూలీలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు, కేంద్ర ప్రభుత్వం తమ తప్పుడు విధానాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని ఇప్పటికీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నరసింహ, మోహన్, సుబ్బన్న, గోవిందు, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

మతోన్మాద విధానాలు వ్యతిరేకించండి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి భిన్నత్వంలో ఏకత్వం అన్న నినాదాన్ని చాటి చెప్పాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్ రమేష్ అన్నారు. మండలంలోని చంద్రానాయక్‌తండాలో శనివారం పర్యటించి ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవినాయక్, రామునాయక్, సూర్యనాయక్, లింగనాయక్, హనుమంతు నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

బైక్, కారు ఢీ: ఒకరికి తీవ్రగాయాలు



బాలకృష్ణ

కొత్తకోట: అతి వేగంతో వెళ్తున్న ఓ కారు, ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని కానాయపల్లి సమీపంలో చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వనపర్తికి చెందిన డ్రైవర్ వెంకటేశ్ కారులో కొత్తకోట నుంచి వనపర్తి వైపు వెళ్తుండగా.. అదేమార్గంలో వనపర్తికి చెందిన బాలకృష్ణ బైక్‌పై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ వెంకటేశ్ తన కారును వేగంగా నడపడంతో అదుపుతప్పి ముందు వెళ్తున్న బాలకృష్ణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి

కొల్లాపూర్: బీజేపీతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకులు రోజారమణి అన్నారు. మహిళా చైతన్య యాత్రలో భాగంగా శనివారం పట్టణంలోని 5వ వార్డులో పర్యటించి మహిళలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రాజకీయంగా మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్న నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. కుట్టు పరిశ్రమ ఏర్పాటుచేసి వంద కుటుంబాలకు జీవనాధారం కల్పించారన్నారు. కేవైఎఫ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళామోర్చా నాయకురాలు బద్దుల శశిరేఖయాదవ్, కల్పనారెడ్డి, జ్యోతి, అఖిల, పల్లవి, మౌనిక తదితరులున్నారు.

బీఎస్పీలోకి భారీ చేరికలు

వనపర్తి టౌన్: బీఎస్పీ (బహుజన సమాజ్ పార్టీ) లోకి భారీగా చేరికలు పెరిగాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెన్నరాములు అన్నారు. అంజనగిరిలోని 100 మంది రైతులు బీఎస్పీలో చేరారని, ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో బీఎస్పీ నాయకుడు రామకృష్ణ రైతులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇన్నేళ్లుగా అధికారంలో ఉన్న పార్టీలో రైతులకు ఎన్నికల సమయంలో హామీలు ఇస్తూ వచ్చారు తప్పితే హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణ, చిరంజీవి, తిరుమలేష్, మన్నెం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వానికి కాదు.. పదవికి రాజీనామా చేయండి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: గట్టుఖానాపూర్ ఎంపీటీసీ దామోదర్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశానని చెప్పడం సరికాదని, పార్టీ తరపున గెలిచిన ఆయన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయాలని సర్పంచ్ కోట్ల వెంకటేష్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రవి సవాల్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి నిరంజన్‌రెడ్డి అండతో పదవులు చేపట్టిన కొందరు నాయకులు మంత్రిపై ఆరోపణలు చేస్తూ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం అవివేకమని ఎద్దేవా చేశారు. జిల్లాలోని ఏ మండలంలో జరగని అభివృద్ధి పెద్దమందడి మండలంలో జరిగిందని, మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టడంతోనే కేఎల్ఐ ద్వారా సాగునీరు వచ్చాయని గుర్తు చేశారు. వనపర్తి నియోజవర్గానికి గతంలో ఎమ్మెల్యేలుగా చేసిన వారు పెద్దమందడి మండలాన్ని పట్టించుకోలేదని, గడిచిన ఎనిమిదేళ్లలో మంత్రి నిరంజన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశాడన్నారు. మంత్రిపై ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరని, వచ్చే ఎన్నికల్లో వారే మీకు తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివశంకర్, గొల్లరాములు, రాజు, నాగరాజు, కృష్ణయ్య, ఖాజాహుస్సేన్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

వనపర్తి టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 52 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్న సంఘం అభ్యర్థిని గెలిపించాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు కోరారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇందుకు తగిన నాయకుడిని ఎన్నుకోవాలని, పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతాడని నమ్మి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శులు బౌద్ధారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో శనివారం ఎస్ఐ రామేశ్వరంరెడ్డి ఆ గ్రామ సర్పంచ్ తిరుపాటి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వాట్సప్, పేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలలో తెలియని వారు ఫోన్, చాటింగ్ చేసిన మాట్లాడవద్దన్నారు. అలాగే తెలియనివారికి ఆధార్, అకౌంట్ నంబర్ అడిగితే ఇవ్వకూడదని చెప్పారు. అనుమానం వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, మల్లేశ్వరం సర్పంచ్ తిరుపాటి నాగరాజు, గ్రామస్తులు నారాయణరెడ్డి, ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది అరవింద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెళ్లి కూతురు వసంతకు ఆర్థికసాయం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కొత్తకోట రూరల్: ఆడపిల్ల పెళ్లికి తన వంతు తోడ్పాటుగా ఆర్థికసాయం అందజేసి పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి ఔదర్యాన్ని చాటుకున్నాడు. మండలంలోని మోజర్లకు చెందిన ఈరమ్మ భర్త కుర్మయ్య కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఈరమ్మ చిన్న కూతురు వసంత పెళ్లి నిశ్చయం కావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి కుటుంబ పరిస్థితిని స్థానిక గ్రామ పెద్ద రామకృష్ణారెడ్డి ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన మేఘారెడ్డి తన వంతు సాయంగా రూ.10వేలు పంపించాడు. ఆ నగదును శనివారం రామకృష్ణారెడ్డి ఈరమ్మ ఇంటికి వెళ్లి అందజేశాడు. తమ కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆర్థికసాయం అందజేసిన ఎంపీపీ మేఘారెడ్డికి ఈరమ్మ, పెళ్లి కూతురు వసంత కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

మండలంలోని మద్దిగట్లకు చెందిన నర్సింహాగౌడ్ (32) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి స్థానిక గౌడ సంఘం సభ్యులు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఎంపీపీ మేఘారెడ్డి తన వంతు సహాయంగా రూ.5వేలు అందించారు.

రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధించొద్దు

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు రాత్రి వేళల్లో త్రీఫేజ్ విద్యుత్‌ను వారం రోజుల క్రితం నిలిపివేయడంతో పంటలు ఎండుతున్నాయని, అందుకు నిరసనగా శనివారం బొల్లారం గ్రామంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. గ్రామ సమీపంలోని చెరువులో కొందరు రైతులు మోటార్లను అమర్చుకుని నీటిని వాడుతున్నారన్న కారణం చేత గ్రామంలో మొత్తం త్రీఫేజ్ విద్యుత్‌ను నిలిపివేశారన్నారు. దీంతో బావుల మోటార్లపై ఆధారపడి పంటలు వేసుకున్న రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తమకు త్రీఫేజ్ విద్యుత్ వదలాలని రైతులు శివ, వెంకటరెడ్డి, కృష్ణయ్య, శేఖర్, మహేశ్, పరశురాముడు, స్వామి, రంగస్వామి కోరారు.



నిరసన తెలుపుతున్న రైతులు

పాఠశాల ప్రహరీకి రంధ్రాలు



జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద..



ఉర్దూ మీడియం పాఠశాల వద్ద కూల్చిన ప్రహరీ

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల కంపౌండ్ గోడలను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొడుతున్న సంబంధింత అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల మైదానాల్లో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పక్షం రోజుల కిందట జెడ్పీఉన్నత పాఠశాల కంపౌండ్ వాల్‌కు రంధ్రం వేసిన గుర్తుతెలియని యువకులు దాన్ని మరింతగా కూల్చి ఏకంగా పాఠశాల మైదానం వెంట రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. వీటి వ్యవహారంలో అధికారులు మిన్నకుండా ఉండడంతో పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన కంపౌండ్ వాల్‌ను కూలగొట్టారు. రాత్రి వేలల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోవడం, పాఠశాల మైదానాల్లో అర్ధరాత్రి వరకు ఉండే వారిని ఎందుకు ఉన్నారని ప్రశ్నించే వారు లేకపోవడంతో పాఠశాలల కంపౌండ్ వాల్ ధ్వంసం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలగొట్టిన కంపౌండ్ వాల్‌కు మరమ్మతు చేపట్టి రాత్రి వేలలో పాఠశాలల వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను వివరణ కోరగా.. గోడ కూల్చిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు ఇచ్చామన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా బోధన చేశారు. అనంతరం ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూత్రశాల నిర్మాణం పూర్తి చేసేది ఎన్నడో?

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి పథకం ద్వారా నూతనంగా నిర్మిస్తున్న మూత్రశాలల నిర్మాణం నత్తనడకన సాగుతుండటంతో బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలో గతంలో ఉన్న మూత్రశాలలు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించి నూతన నిర్మాణ పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. ఈ పాఠశాలలో వంద మంది బాలికలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. మూత్రశాలల నిర్మాణం పూర్తి కాకపోవడంతో పక్కన ఉన్న బాలుర ఉన్నత పాఠశాలల్లోని ఒక మూత్రశాలను వినియోగించుకుంటున్నారు. దీంతో బాలికలు, మహిళా ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల బాలికలు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా మూత్రశాల గది

బండి సంజయ్‌ను వ్యాఖ్యలపై నిరసన



కొత్తకోట చౌరస్తాలో బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను వెంటనే తన రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి సస్పెండ్ చేయాలని వనపర్తి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తకోట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవితకు మద్దతుగా నినాదాలు చేస్తూ బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వామన్‌గౌడ్ మాట్లాడుతూ.. బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి.. కవితను అరెస్టు చేయకపోతే ముద్దు పెట్టుకోవాలా అని మాట్లాడటం మహిళా సమాజానికి సిగ్గు చేటని, వెంటనే ఆ వాఖ్యలు ఉపసంహరించుకొని, ఆమెకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుఖేషిని, ఎంపీపీ గుంత మౌనిక, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు విశ్వేశ్వర్, పీజే బాబు, బీఆర్ఎస్ నాయకులు బాబురెడ్డి, ఖాజమైనోద్దీన్, బాలనారాయణ, గాడీల ప్రశాంత్, జగన్‌మ్మోహన్‌రెడ్డి, శ్రీనుజీ, రాములు యాదవ్, కొండారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తిరుపతయ్య, వసీంఖాన్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, సర్పంచ్ రాంనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు రవీందర్‌రెడ్డి, యాదమ్మ, అనిత, అశోక్, అర్చన, నాగన్నయాదవ్, వెంకటేష్ యాదవ్, చాంద్ పాషా, మనోజ్ కుమార్, టీకే శారద, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మదనాపురం పోలీస్‌స్టేషన్‌లో..